

ఆర్‌టిసిలో కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం అర్బన్ : ఆర్‌టిసిలో వివిధ ఉద్యోగాల్లో పనిచేస్తూ... అనారోగ్య కారణాలతో మృతి చెందిన నలుగురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కండక్టర్లుగా కారుణ్య నియామకాలు చేపట్టారు. నగరంలోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ శనివారం నియామకపు పత్రాలను అందజేశారు. డ్రైవర్లుగా పనిచేసి మృతి చెందిన కాంతారావు భార్య ఎం.సుగుణమణి, ఎం.ఎం.రావు కుమారుడు ఎం.ఎల్.నారాయణ, ఎస్.జి.మూర్తి కుమారుడు ఎస్.సంజయ్, బి.పి.రావు కుమారుడు వినయ్ కుమార్‌లకు కండక్టర్లుగా నియామకాలు చేపట్టినట్లు విజయకుమార్ తెలిపారు. నియమకపు పత్రాలు అందజేసిన వారిలో ఆర్‌టిసి పర్సనల్ అధికారి ఎస్‌పి కృష్ణవేణి, సీనియర్ అసిస్టెంట్ ఎం.కె.నాయుడు పాల్గొన్నారు.



నియామకపు పత్రాలను అందజేస్తున్న విజయకుమార్

గడువులోగా నదుల అనుసంధానం పూర్తి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులు వచ్చే సీజన్ నాటికి పూర్తి చేసుకునేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పెండింగ్ పనులపై నీటిపారుదల, వంశధార ఇంజినిరింగ్, రెవెన్యూ అదికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన సాగునీటి వనరైన వంశధార, నాగావళి నదుల్లో నీటిని వినియోగించుకునేందుకు వీలుగా నిర్మాణంలో ఉన్న నదుల అనుసంధానం ప్రాజెక్టు జూన్-2025 నాటికి పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నదుల అనుసంధానం కోసం ఇప్పటి వరకు రూ.106 కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు. 75 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూ సేకరణ పెండింగ్ వల్ల పనులు ఆలస్యమైనట్టు అధికారులు వివరించారు. తక్షణమే భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంశధార ప్రాజెక్టుపై సమీక్షించిన ఆయన ఒడిశాతో నేరడి బ్యారేజీకి ఉన్న వివాదం, సైడ్ వియ్యర్ నిర్మాణం, సింగిడి, పారాపురం, హిరమండలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరుల నిర్మాణాలపై చర్చించారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు గేట్లు అమర్చాల్సి ఉందని వంశధార ఎస్ఇ వివరించారు. హిరమండలం ప్రధాన రిజర్వాయరు డెడ్ స్టోరేజ్, రిజర్వాయర్ పనులతో పాటు ప్యాకేజీ 87, 88 పనులు, కాలువల నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. స్టేజ్-2 ఆఫ్ ఫేస్-2 పనులు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ పనులతో పాటు కోర్టు వివాదాలు, భూసేకరణ, పెండింగ్ బిల్లులపై చర్చించారు. హిరమండలం ప్రధాన రిజర్వాయరు కోసం నిర్మాణంలో ఉన్న గొట్టా బ్యారేజ్ ఎత్తిపోతల పథకం పనులపై చర్చించారు. వచ్చే ఏడాది నది నుంచి నీటిని పంపుల ద్వారా రిజర్వాయరుకు తరలించి 19 టిఎంసిల నీటిని నిల్వ ఉంచేందుకు వీలుగా నిర్మాణం పనులు సాగుతున్నట్టు వివరించారు. ఉద్దాన ప్రాంతంలోని 700 గ్రామాలకు తాగునీరు అందించే పథకం వంశధార ప్రాజెక్టుపైనే ఆధారపడి పనిచేస్తుందని అన్నారు. అందువల్ల రిజర్వాయరులో నీటి నిల్వలు తగ్గకుండా ఉండేందుకు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టరు సూచించారు. రేగులపాడు వద్ద నిర్మాణంలో ఉన్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించారు. 24,600 ఆయకట్టుకు సాగునీరందించే ఈ ప్రాజెక్టు 40 శాతం పనులు మాత్రమే పూర్తి చేసినట్లు ఇఇ శేఖర్ వివరించారు. పలాస, మెళియాపుట్టి రోడ్డులో 3.6 కిలోమీటర్ల మేర వేయాల్సిన డైవర్షన్ రోడ్డుకు భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్, శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఇ స్వర్ణకుమార్, హిరమండలం రిజర్వాయరు డిఇ రమణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అన్యాయం

ప్రజాదర్బార్‌లో కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మహిళలు



వినతులను స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

2019కు ముందున్న టిడిపి ప్రభుత్వ హయాంలో పట్టణ పేదలకు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఆ సమయంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి అప్పులు చేసి రూ.10 వేలు, రూ.లక్ష, రూ.లక్షన్నర డిపాజిట్లుగా చెల్లించామని నగరానికి లబ్ధిదారుల మహిళలు తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ దర్బార్‌లో పాల్గొన్న లబ్ధిదారులు వినతిపత్రాలను అందజేసి మొర పెట్టుకున్నారు. ఇళ్లు లేక పోయినా కనీసం డిపాజిట్ మొత్తాలనైనా చెల్లించాలని కోరారు. నగరంలో 24 గంటల నిరంతర తాగునీటి సరఫరా సక్రమంగా అమలు చేయడం లేదని, కొన్ని ప్రాంతాల్లో రోజులో గంట సమయమూ నీరు రావడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. పట్టణ పేదలకు గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో నివాస యోగ్యంగా ఉండడం లేదని వివరించారు. అందువల్ల మౌలిక వసతులు కల్పించాలని వాకలవలస కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ప్రజా దర్బారులో ఒక్క రోజు 270 వినతులు వచ్చాయి. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వీలుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన ప్రజా దర్బార్ స్ఫూర్తితో జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్నామని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించిన ఇళ్లు ఇచ్చే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండేది కాదన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ సుధీర్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్‌ను పొందడానికి అర్హులను గుర్తించడానికి వీలుగా లబ్ధిదారుల వ్యక్తిగత సమాచారాన్ని తెలియ జేయాలని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. లబ్ధిదారుల ఆధార్ నంబరు, రేషన్, బియ్యం కార్డు నంబరుతో లింకు చేయబడిన బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ నంబరు ఉన్న లబ్ధిదారుల జాబితా సంబంధిత ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీల వద్ద అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందగోరు లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో బుకింగ్ చేసి గ్యాస్ ధర చెల్లించాలన్నారు. ఆ తర్వాత అనుసంధం చేసిన ఫోన్ నంబరుకు గ్యాస్ ఏజెన్సీ నుంచి మెసేజి వస్తుందని తెలిపారు. మెసేజ్ వచ్చిన లబ్ధిదారులకు 24 గంటల వ్యవధిలోగా తిరిగి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తారని తెలిపారు. ఈ పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ కావాల్సిన వారు 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి నమోదు చేసుకోవచ్చన్నారు. లబ్ధిదారులు గ్యాస్ బుకింగ్ కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూడు సిలిండర్లు ఉచితంగా నాలుగు నెలలకు ఒకసారి తీసుకోవచ్చన్నారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు మొదటి సిలిండర్, ఆగస్టు నుంచి నవంబరు వరకు రెండోది, డిసెంబరు నుంచి మార్చి వరకు పొందవచ్చన్నారు. ప్రభుత్వం పేద ప్రజల ఆర్థికంగా మేలు చేసేందుకు అమలు చేస్తున్న ఈ పథకం లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకునేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

బస్సు సర్వీసులను వినియోగించుకోవాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆయా ప్రాంత ప్రజలు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలిలో పోలీస్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన ఏడు ఆర్‌టిసి బస్సులను శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బస్సులు శ్రీకాకుళం-1, 2, టెక్కలి డిపోలకు చెందిన వివిధ రూట్లకు సర్వీసు అందిస్తాయన్నారు. టెక్కలి-శ్రీకాకుళం-అమలాపురం మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, టెక్కలి, విశాఖపట్నం, ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త ఎక్స్‌ప్రెస్, టెక్కలి, విశాఖపట్నం, ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త (అద్దె ఎక్స్‌ప్రెస్), శ్రీకాకుళం, విజయవాడ మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, శ్రీకాకుళం, విజయనగరం మార్గంలో ఒక ఎక్స్‌ప్రెస్, శ్రీకాకుళం-బత్తిలి మార్గంలో ఒక అద్దె పల్లె వెలుగు, శ్రీకాకుళం-విశాఖపట్టణం మార్గంలో ఒక అద్దె అల్ట్రా డీలక్స్ బస్సులు ఆయా రూట్లలో ప్రజలకు సర్వీసులు అందిస్తాయన్నారు. ఇందులో మూడు బస్సులు అద్దెవని, నాలుగు బస్సులు ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు బస్సుల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని సర్వీసులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బాగాది శేషగిరి, పిసకాన అజయ్ కుమార్, కోల లవకుమార్, లాడి శ్రీనివాసరావు, హనుమంతు రామకృష్ణ, కెల్లి శ్రీరాములు, ఆర్ఎం, శ్రీకాకుళం 1,2, టెక్కలి డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం

పాతపట్నం: ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందామని, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ అధ్యక్షతన పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, కొత్తూరు యుటిఎఫ్ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సంక్షేమానికి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక అభ్యున్నతికి, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి, సాధారణ ఉపాధ్యాయుల గొంతుకగా పిడిఎఫ్ అభ్యర్థిగా వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారని అన్నారు. అందుకుగాను ఉత్తరాంధ్రలోని అధ్యాపకులు ఉపాధ్యాయులు తమ ఓట్లను ఫారం-19 ద్వారా నవంబరు 6లోగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఉద్యమ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొండాల చక్రపతి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, జిల్లా నాయకులు బర్రి పురుషోత్తం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాతపట్నం హెడ్మాస్టర్ సనపల వైకుంఠ రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాపు తెంబూరు ప్రధానోపాధ్యాయులు రామారావు, పాతపట్నం మెలియాపుట్టి, సారవకోట, కొత్తూరు యుటిఎఫ్ మండల నాయకులు పడ్డ మోహనరావు, కవీశ్వరరావు,ఎల్ ఎన్ కొల్లి, ఎం.శంకరరావు, మామిడి షణ్ముఖరావు, కె విజయ్, తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమంగా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఉద్యమ అభ్యర్థిని గెలిపించుకుంటామని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి నికరంగా కృషి చేస్తున్న యుటిఎఫ్‌లో చేరిన ఉపాధ్యాయులు వి.బి.లక్ష్మీనారాయణకు అభినందించారు. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు బోడ శ్రీను, మజ్జి వెంకటరమణ, కర్రి పురుషోత్తం, కె.విజయ్‌కుమార్, బాలకృష్ణ, నారాయణరావు, వీరభద్ర, రవి, ధనుంజయ, లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిధర్, తదితరులు

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయాలు, మందుగుండు సామాగ్రి నిలువకు వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారు సంబంధిత అన్ని విభాగాల అనుమతులు తప్పనిసరిగా పొందాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీ చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి మందుగుండు సామాగ్రి నిల్వ లేకుండా చూడాలన్నారు. అటువంటి అక్రమ నిల్వ మందుగుండు సామాగ్రి కలిగినట్లయితే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాణసంచా నిల్వలు, విక్రయాలు అనుమతులు ఉన్న గొడౌన్లు, షాపులు వద్ద భద్రత ప్రమాణాలు, ఇసుక, అగ్నిమాపక శకటాలు అందుబాటులో ఉంచాలన్నారు. బాణసంచా విక్రయాలు దుకాణాలు ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు దుకాణాల మధ్య 5 నుంచి 10 అడుగుల మధ్య దూరం పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా, ప్రశాంతంగా దీపావళి పండుగ జరుపుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

అవగాహన, అప్రమత్తతోనే సైబర్ నేరాలు కొంతమేరకు నియంత్రించవచ్చునని ఎస్‌పి అన్నారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో జరుగుతున్న రకరకాల సైబర్ నేరాలు, మోసాలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ రూపాల్లో మన వ్యక్తిగత సమాచారం సేకరించి వాటితోనే సైబర్ మోసగాళ్లు మోసగించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో ఓటిపి, లింకు క్లిక్, మాల్వేర్, ఎపికె ఫైల్ తరహా నేరాలతో పాటు ఈ మధ్యకాలంలో డిజిటల్ అరెస్టు తరహా నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, గుర్తింపు కార్డు వివరాలు అనధికారి వ్యక్తులకు, సంస్థలకు తెలపకూడదని సూచించారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు పోలీసులు మంటూ నమ్మిస్తూ, పోలీసు యూనిఫారాలతో మారువేషంలో బెదిరింపు ఫోన్ కాల్స్ చేసి డిజిటల్ అరెస్టుకు ప్రయత్నిస్తున్నారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో అటువంటి ఫోన్ కాల్స్ అన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు. ప్రజలందరూ సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తతో ఉండాలని సూచించారు. జిల్లా పోలీసు అధికారులు సిబ్బందితో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబరుకు సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.



బాధితులకు 154 మొబైల్ ఫోన్లు అప్పగింత

జిల్లాలో రెండు నెలల వ్యవధిలో పోగొట్టుకున్న 154 మొబైల్ ఫోన్లను ఎస్‌పి విలేకరుల సమావేశం అనంతరం అప్పగించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.79 లక్షల విలువ గల 618 ఫోన్లను పోగొట్టుకున్నారని వాటిని రికవరీ చేసి బాధితులకు అప్పగించామని తెలిపారు. ఫోన్లను పోగొట్టుకున్నవారు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ceir.gov.in అనే వెబ్ సైట్ లో ఫోన్‌ను తిరిగి పొందేందుకు బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇలా వచ్చిన ఫిర్యాదులు మేరకు గత రెండు నెలల వ్యవధిలో 154 ఫోన్లు రికవరీ చేశామని చెప్పారు. వాటి విలువ సుమారు మొత్తంగా రూ.24 లక్షలుఉంటుందని వివరించారు. మొబైల్స్ వినియోగించే వారు తప్పనిసరిగా ఫోన్లుకు సెక్యూరిటీ లాక్ ఉపయోగించాలన్నారు. వ్యక్తిగత, విలువైన సమాచారాన్ని మొబైల్స్‌లో ఉంచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అతితక్కువ కాలంలోనే పోగొట్టుకున్న ఫోన్లు రికవరీ చేసి తమకు అందించినందుకు బాధితులు సంతోషం వ్యక్తపరుస్తూ ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ సెల్ సిఐ టి.శ్రీను, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఇరుముడితో విమాన ప్రయాణం

పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



ఏటా అయ్యప్ప దీక్షలు చేపట్టే లక్షలాది మంది యాత్రికులు ఇరుముడితో నేరుగా విమాన క్యాబిన్‌లోనే ప్రయాణం చేయవచ్చని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో వెల్లడించారు. దీనికి అనుగుణంగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ డీజీ ఉత్తర్వులు వెల్లడించినట్లు తెలిపారు. భద్రతా కారణాల రీత్యా విమానాల్లోకి కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని ఇన్నాళ్లూ అనుమతించడం లేదన్నారు. దీంతో అంతా రైళ్లు, బస్సులు, ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు.

మకర జ్యోతి వరకు అవకాశం

మండల దీక్ష చేపట్టే అయ్యప్ప భక్తులకు ఇరుముడి ప్రత్యేకమైందన్నారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ఇన్నాళ్లూ లక్షలాది మంది యాత్రికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. తాజా ఉత్తర్వులతో ఎయిర్ పోర్ట్ సిబ్బంది స్కానింగ్ చేసిన తరువాత.. ఇరుముడితో నేరుగా విమాన క్యాబిన్‌లోనే ప్రయాణం చేయవచ్చని తెలిపారు. వెంటనే అమల్లోకి వచ్చే ఈ సౌలభ్యం.. మకర జ్యోతి దర్శనం ముగిసి, జనవరి 20 వరకు భక్తులకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అయ్యప్ప భక్తులంతా దీనిని గమనించి, తనిఖీ సమయంలో సిబ్బందికి సహకరించాలని కోరారు.

మండల సమావేశం రసాభాస

● టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం ● రోడ్డుపై బైఠాయించిన తొగరాం సర్పంచ్ వాణిశ్రీ



బైఠాయించిన సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదంతో రసాభసాగా మారింది. ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో ఎంపిడిఒ రోణంకి వెంకట్రావు ముందుగా వ్యవసాయ శాఖపై సమీక్షను ఆహ్వానించారు. మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు విత్తనాలు వివిధ అంశాలపై మాట్లాడుతుండగా తొగరాం సర్పంచ్, మాజీ స్పీకర్ సతీమణి తమ్మినేని వాణిశ్రీ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, సకాలంలో అందించడం లేదని ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందక ఆమదాలవలస పట్టణంలో వర్తకుల దగ్గర అధిక ధరలకు ఎరువులు విత్తనాలు కొనుగోలు చేయవలసి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై టిడిపి సభ్యులు నూక రాజు, సనపల ఢిల్లీశ్వరరావు తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. టిడిపి సభ్యులు మాట్లాడుతూ గడచిన వైసిపి ఐదేళ్ల పాలనలో రైతులకు ఎంతమందికి ఎన్ని రకాలుగా ఉపయోగం చేశారో సమావేశంలో తెలియజేయాలని ఎఒను ప్రశ్నించారు. దీంతో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కాని వారు సమావేశంలో ఎలా ఉంటారని వాణిశ్రీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ... ఎంపిడిఒను ప్రశ్నించారు. అలాగే ఎంపిపి తమ్మినేని శారదను ఆమె ప్రశ్నిస్తూ... మీరు ఫ్యాన్ గుర్తుపై గెలిచారా? సైకిల్ గుర్తుపై గెలిచారా? సభ్యులు కానీ టిడిపి సభ్యులను సమావేశం నుంచి పంపించండి అంటూ ఆవేశంగా మాట్లాడారు. ఈ విషయంపై కలుగజేసుకున్న మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు, వైసిపి నాయకులు తమ్మినేని శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఇక్కడ ఫ్యాన్, సైకిల్ గుర్తులు గురించి మాట్లాడడం సబబు కాదని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అందర్నీ సమావేశాలకు ఆహ్వానించారని, ఇప్పుడు దానిని కాదంటూ వారించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

దీంతో టిడిపి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వాణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసిపి సభ్యులతో సమావేశం నుంచి వెళ్లి మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల సమావేశంలో సభ్యులు కాని వారిని అనుమతించకూడదంటూ తాను ప్రశ్నించినా ఎంపిడిఒ స్పందించలేదని అన్నారు. పంచాయతీ ప్రథమ పౌరులకు సర్పంచ్‌లకు టిడిపి కూటమి ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వడం లేదని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అనంతరం సమావేశ మందిరంలో శాఖల వారీగా సమీక్షించారు.

ఉచిత ఇసుక అసలు లబ్ధి ఎవరికెరుక?



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం ఏ పథకం ఎందుకు తీసుకువస్తుందో అర్థం చేసుకుంటే ఆ పథకం వెనుక పరమార్థమేమిటో అవగతమవుతుంది. ఒక పథకం, విధాన నిర్ణయం తీసుకున్న సందర్భంలో పేదల కోసమే అని బయటకు చెప్పినా అంతర్లీనంగా అది పేదలతో పాటు తమ పార్టీకి, తమ మనుషులకు పరోక్షంగా లబ్ధికలిగేలా చూసుకోవడం పాలక పార్టీలకు తెలిసిన విద్య. టిడిపి కూటమి సర్కారు తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ అదే కోవలోకే వస్తుంది. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంతో సామాన్య ప్రజలు కంటే బిల్డర్లు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలే ఎక్కువ లబ్ధి పొందుతున్నాయి. ప్రజలకు ఉచిత ఇసుక అందించేందుకు జిల్లాలో ఏడు ఇసుక పాయింట్లను, మూడు డిసిల్టేషన్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇందులో గార మండలం గార, బూరవెల్లి, ఆమదాలవలస మండలం అంబాళ్లవలస, శ్రీకాకుళం మండలం బట్టేరు, నరసన్నపేట మండలం గోపాలపెంట, కొత్తూరు మండలం నివగాం, బూర్జ మండలం కాఖండ్యాం వద్ద ఇసుక స్టాక్ యార్డు నుంచి ఉచితంగా ఇసుక పొందవచ్చని ప్రభుత్వం చెప్తోంది. ఇందులో బూరవెల్లి, ఆమదాలవలస ఇసుక పాయింట్లను విశాఖ అవసరాలకు కేటాయించారు. ఇక్కడ నుంచి జిల్లా అవసరాలకు వాడుకునే వీలు లేదు. మిగిలిన పాయింట్లలో జిల్లాకు చెందిన ఇసుక వినియోగదారులతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ఎవరైనా ఉచిత ఇసుక తీసుకు వెళ్లొచ్చు. ప్రయివేట్ వ్యక్తులు బల్క్‌గా బుక్ చేసుకుని తరలించొచ్చు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానమే బిల్డర్లు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు వరంగా మారింది. విశాఖ జిల్లాకు చెందిన నిర్మాణ సంస్థలు దీనిని బాగా సద్వినియోగచేసుకోవడంలో ముందు వరుసలో ఉన్నాయి. ప్రభుత్వాన్ని ఒప్పించి జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లను విశాఖ నిర్మాణ కంపెనీలకు కేటాయించడంలో టిడిపికి చెందిన ఓ ముఖ్యనేత వారికి అభయహస్తం ఇచ్చి వారి కోర్కెను నెరవేర్చడంలో ఇతోధికంగా సాయపడ్డారు. టిడిపి కూటమి ప్రభుత్వం కొత్తగా ఇసుక పాలసీ తీసుకొచ్చిన మొదటి నెలలో జిల్లాలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇక్కడి అవసరాలకే వినియోగించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఆ తర్వాత జిల్లాలోని ఏ రీచ్‌లో నుంచైనా విశాఖ నిర్మాణ సంస్థలు తీసుకు వెళ్లే వెసులుబాటు కల్పించారు. ఇప్పుడు విశాఖ భవన నిర్మాణ కంపెనీలకు ఏకంగా రెండు రీచ్‌లు కేటాయించడం గమనార్హం. బూరవెల్లి లేక ఆమదాలవలస రీచ్‌లకు సమీపంలో ఉన్న ప్రజలు తమ భవన నిర్మాణాలకు గుప్పెడు ఇసుకనూ పట్టుకునేపోయే అవకాశం లేదు. ఇసుక కోసం వారు కూడా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుని వేరే రీచ్‌ల నుంచి తెచ్చుకోవాల్సిందే. ఇది స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ట్రాక్టర్ ఇసుక కోసం ఇన్ని వ్యయ ప్రయాసలు పడాలా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇసుక కోసం స్థానికులు పడుతున్న ఇబ్బందులను, అనుభవాలను పరిశీలించిన తర్వాత ఉచిత ఇసుక ఎవరికి బాగా ఉపయోగపడుతుందో వేరే చెప్పనక్కర్లేదు.

ఇసుకను ఓవర్ లోడింగ్ చేస్తే గతంలో కేసు. ఇప్పుడు దానిని ఆపితే అపరాధం. ఓవర్ లోడ్ వాహనాలను ఆపొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఇది కూడా ప్రయివేట్ వ్యక్తులు, బిల్డర్లుకు ఉపయోగపడేదే. ఇళ్ల నిర్మాణాల కోసం సామాన్య జనం ట్రాక్టర్లతో తీసుకువెళ్తారు తప్ప అంతేసి పరిమాణంలో తరలించే పరిస్థితే ఉండదు. గతంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు వెళ్లే ఇసుక లారీలన్నీ ఓవర్ లోడ్‌తోనే వెళ్లాయి. వాటిపై కేసులూ నమోదయ్యాయి. ఇప్పుడు ఓవర్ లోడ్ నిబంధన ఎత్తేయడంతో బిల్డర్లకు ఇక అడ్డే ఉండదు. జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లను ప్రత్యేకంగా కేటాయించడం, ఓవర్ లోడింగ్ నిబంధన ఎత్తేయడంతో ఇక అంతా చట్టపరంగానే ఇసుకను తరలించొచ్చని వారు సంబరపడిపోతున్నారు. కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, బిల్డర్లకు ప్రభుత్వం మరో ఆఫర్ కూడా ఇచ్చింది. ఇసుకపై సీనరైజ్, జిఎస్‌టి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుకను పొందేందుకు ఇప్పటివరకు రవాణ ఛార్జీలతో పాటు సీనరైజ్, జిఎస్‌టి చెల్లించేవారు. ఇకపై వారు సీనరైజ్, జిఎస్‌టికి సంబంధించిన వారిపై ఆర్థిక భారం పడుతుందని ప్రభుత్వం కనికరించి ఆ పన్నులను ఎత్తేసింది. సీనరేజ్ రూపంలో పంచాయతీలకు ఇవ్వాల్సిన ఆ మొత్తాన్ని తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చింది. ఇంటి నిర్మాణానికి ఒక సామాన్య వ్యక్తి ఒకట్రెండు టన్నులకు మించి తీసుకువెళ్లారు. వీరిపై సీనరైజ్, జిఎస్‌టి రూపంలో పడే భారం అంతంత మాత్రమే ఉంటుంది. అదే వందల టన్నుల ఇసుకను తీసుకువెళ్లేవారు. సీనరైజ్, జిఎస్‌టి రూపంలో కోట్ల రూపాయాల్లో చెల్లించాల్సి ఉంటోంది. ఇప్పుడు ఆ డబ్బులను సైతం ప్రభుత్వం వదులుకునేందుకు సిద్ధమయ్యింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం రవాణకు సంబంధించిన వెసులుబాటు నిర్ణయాలు ఎవరి కోసం స్పష్టమవుతోంది. గతంలో మాదిరిగా తాము ఏం చెప్తే ప్రజలు అదే నమ్ముతారనే భ్రమల్లో పాలకులు ఉన్నట్లు ఉన్నారు. చైతన్యం కలిగిన ప్రజలు ప్రభుత్వం వేస్తున్న ప్రతి అడుగునూ నిశితంగా పరిశీలిస్తున్నారు. సరియైన సమయంలో వారు స్పందిస్తారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రైతాంగాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి- జలుమూరు

జలుమూరు మండలం టెక్కలిపాడు ఎత్తిపోతల పథకాన్ని శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పున్ణప్రారంభించారు. గత కొద్దిరోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని రైతులు ఎమ్మెల్యేకి తెలపగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేసి రూ.6 లక్షల 50 వేలుతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు వెలమల చంద్ర భూషణ్, భైరి భాస్కరరావు, సర్పంచ్‌లు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, గుండ మన్మధరావు, పిరియా వెంకట రావు, తాన్ని అసిరినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

సమయపాలన తప్పనిసరి

ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ

లావేరు: అంగన్వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ పీడీ బగాది శాంతిశ్రీ అన్నారు. మండలంలోని బొంతుపేట, లావేరు-3, గోవిందపురం అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోషణ వాటిక వాటర్ హార్వెస్టింగ్ డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులను పరిశీలించారు ప్రీ స్కూల్ విధానాన్ని పరిశీలించారు. ఈమె వెంట రణస్థలం సిడిపిఒ సిహెచ్.జాన్సీరాం, సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

రీ సర్వే భూసమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ల్యాండ్ సర్వే ఎడి విజయకుమార్ అన్నారు. శనివారం మండలంలోని లోపెంటలో జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులకు ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. రీసర్వేలో భూమి విస్తర్ణం తగ్గినా, ఎల్‌పిఎం నెంబర్లు తప్పు ఉన్నా, ఒకే రైతుకు ఎక్కువ ఖాతాలున్నా, మెటేషన్ తదితర సమస్యలున్న వారు ఈ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. 87 సమస్యలపై వినతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్ని జోగారావు, రీసర్వే డిటి ఎన్.తిరుపతిరావు, ఆర్ఐ ఆర్.అప్పలరాజు, సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, విఆర్ఒ మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ అలుపాన సూర్యం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన నగరంలోని తుమ్మావీధిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానికంగా ఉన్న ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. వేదిక ప్రతినిధులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.వేణుమాధవ్‌లు హాజరై 50 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ వెంకటేశ్వరరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ కళ్యాణ్ రాజు, కేశవ్, తుమ్మావీధి కార్యక్రమాల కమిటీసభ్యులు పి.శాంతారావు, కనకల శ్రీను, పి.సుధాకరరావు, కుల్లాన లక్ష్మి, విజికె మూర్తి, కె.శ్రీనివాసు, లావణ్య శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కార్యకర్తల సంక్షేమానికి కృషి



రణస్థలం : టిడిపి సభ్యత్వ నమోదులో ఎంపీ కలిశెట్టి



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టిడిపి ఆవిర్భావించి 42 సంవత్సరాలు సుదీర్ఘంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామంటే కార్యకర్తల బలమేనని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి నింపుతుందన్నారు. పార్టీ సభ్యత్వానికి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ ఆనాడే బీజం వేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ముందుకు వెళు_న్నారని పేర్కొన్నారు. గతంలో రూ. 2 లక్షలు ఉన్న బీమా... ప్రస్తుతం రూ. 5 లక్షలకు పెంచారని అన్నారు. మట్టి ఖర్చులకు రూ. 10 వేలు ఇస్తారని చెప్పారు. అనంతరం మంత్రి సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, కోల లవకుమార్, లాడి శ్రీనివాసరావు, హనుమంతు రామకృష్ణ, మట్ట సుందరమ్మ, మెండ దమయంతి పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం, కోష్ఠ, పతివాడ పాలెంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు, ఐటి అండ్ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా టిడిపి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లిలో 25, 26 డివిజన్ల పరిధిలో టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు నాగరత్నం, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణం, డివిజన్ ఇన్‌ఛార్జి ఉంగటి రమణ, మైలపల్లి అర్జున్, గొలివి దాము, కొయ్యాన రామ్మోహన్, జగదీష్, జ్యోతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట : సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాతపట్నం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పైల బాబ్జి, సైలాడ సతీష్, చెన్నయ్య, భుజంగరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: మండలం రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే అశోక్ సభ్యత్వం తీసుకుని డబ్బులు చెల్లించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నరసన్నపేట : సభ్యత్వ నమోదుతోనే టిడిపి కార్యకర్తలకు భరోసా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పట్టణంలోని హడ్కో కాలనీలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో పోలాకి మండల టిడిపి అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, భైరి భాస్కరరావు, చంద్రశేఖర్, చిట్టిబాబు, మెండ రాంబాబు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేద్దామని టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి రూ.100 చెల్లించి తన సభ్యత్వ నమోదును రెన్యూవల్ చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, లాడి దాలప్పన్న, కోరాడ చిన్న గోవింద పాల్గొన్నారు.

పలాస : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, వజ్జ గంగాభవాని, ఎం.నరేంద్ర (చిన్ని), గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్త, బడ్డ నాగరాజు, డొక్కర శంకర్, యవ్వారి మోహనరావు, దడియాల నర్సింహులు మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : సభ్యత్వ నమోదు తీసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు



పాతపట్నం : సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు



కవిటి : సభ్యత్వం తీసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్



డచ్ బంగ్లా వద్ద పర్యటిస్తున్న రామ్మోహననాయుడు

డచ్ బిల్డింగ్ పరిసరాల్లో ఉద్యానవనం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మూడు శతాబ్దాల నాటి పురాతన భవనం కలెక్టరేట్ వద్ద ఉన్న డచ్ భవనం చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి శనివారం డచ్ బంగ్లాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీ గేట్ తరహాలో డచ్ భవన్ చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని గ్రీనరీని ఏర్పాటు చేయాలన్నారు. నాగావళి నది కనిపించేటట్లు, శ్రీకాకుళం నగర ప్రజానీకం సేద తీరేందుకు ఒక ఐకానిక్‌గా డచ్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలన్నారు. రూ.వంద కోట్లతో అరసవెల్లి సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గార మండలం శ్రీకూర్మం సర్క్యూట్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రఖ్యాత సంస్థలకు ఈ డిజైన్లను రూపొందించే పని అప్పగించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో శ్రీకాకుళం జిల్లాలో సిక్కోలు సంబరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

దీపావళి సంబరాలు

రహదారులు, భవనాల గ్రౌండ్‌లో దీపావళి సంబరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ కేంద్ర మంత్రికి వివరించారు. ఆర్‌డిఒ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, పర్యాటక శాఖ అధికారి ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

2న లావేరు మండల సమావేశం

లావేరు : లావేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబరు 2న ఉదయం 11 గంటలకు ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ వెంకటరాజు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి, మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.



అధికారుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

గ్రామసభల్లో అధికారులు

అవస్థల్లో విద్యార్థులు

బూర్జ: ధ్రువపత్రాల కోసం విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన విద్యార్థులకు అధికారుల జాడ కనిపించకపోవడంతో ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. శనివారం వివిధ రకాల ధ్రువపత్రాల కోసం వచ్చిన విద్యార్థులు కార్యాలయంలో అధికారులు ఎవరూ లేకపోవడంతో చేసేది ఏమీ లేక ఇంటి ముఖం పట్టారు. ముఖ్యంగా ఆర్మీ సెలక్షన్‌కు వెళ్లే అభ్యర్థులు తమ పత్రాలను నవంబర్ ఒకటవ తేదీలోగా అందజేయాలని అభ్యర్థులు తెలిపారు. అయితే కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని. కనీసం విఆర్ఒ, ఆర్ఐ కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధ్రువపత్రాలు అందకపోతే మా భవిష్యత్ అంధకారం అవుతుందని వాపోయారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం అన్ని గ్రామాల్లో గ్రామసభల్లో అధికారులు పాల్గొంటున్నారని తెలుస్తుంది. ఏది ఏమైనా విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చేస్తున్నారు.

1లోగా భాషా పండిట్

పరీక్ష ఫీజుల చెల్లింపు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో భాషా పండిట్ పరీక్షలను గతంలో తప్పిన వారు తిరిగి నవంబరు 2024 పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా ఫీజుల చెల్లింపునకు నవంబరు 1 వరకు గడువు విధించినట్టు డిఇఒ ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి వెబ్‌సైట్ bse.ap.gov.in అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష ఫీజులను వెబ్‌సైట్‌లో చెల్లించి పరీక్ష రాసేందుకు అర్హత పొందాలన్నారు.

కూటమిది డైవర్షన్ రాజకీయాలు

ఎమ్మెల్సీ నర్తు రామారావు



రామారావు, ఎమ్మెల్సీ

కవిటి: రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలను చంద్రబాబు అండ్ కంపెనీ చేపడుతోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల అమలు తీరు సక్రమంగా లేదని అన్నారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో అఘాయిత్యాలు జరుగుతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలు వియోగం, వ్యాపారం ఈ ప్రభుత్వంలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా చలామణి అవుతున్నట్లు విమర్శించారు. డయేరియాతో ఒక్క విజయనగరంలోనే 13 మంది చనిపోయారని, ప్రజల ప్రాణాల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. ఎంతో బాధ్యతతో పరిపాలన చేయాల్సిన ముఖ్యమంత్రి రాజకీయ ప్రతీకార చర్యలతో, డైవర్షన్ రాజకీయాలు చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఒకసారి తిరుపతి లడ్డు అపవిత్రం అయిందని, మరోసారి జగన్ కుటుంబ వ్యవహారాలు, ఇంకోసారి రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంటూ కాలక్షేపం చేస్తూ కూటమి ప్రభుత్వం కాలం వెల్లదీస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు థర్మల్ పుస్తక పరిచయ సభ

సోంపేట: పట్టణంలోని కళాసీ సంఘ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సోంపేట థర్మల్ ఉద్యమంపై రాసిన పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిపిఎస్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మానవ హక్కుల వేదిక సభ్యులు కె.అనురాధ రాసిన బీల కోసం - బతుకు కోసం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరారు. ఆయనతోపాటు మత్స్యకార ఐక్యవేదిక, మానవ హక్కుల వేదిక ప్రతినిధులు కోరారు.

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలి

డివిఇఒ తవిటినాయుడు

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుంతా పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి తవిటినాయుడు సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలల్లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు సాధారణ తరగతులతో పాటు అదనంగా ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంపుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కమిషనర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ గ్రూప్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. అనంతరం కళాశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ, లైబ్రేరియన్ కమ్ ఎజిఎంసి వదనగిరి, అధ్యాపకులు డాక్టర్ మల్లేష్, సోమశేఖర్, గుండు శాంతారావు, ఆనందరావు లక్ష్మీనారాయణ, దుగ్గివలస రాంప్రసాద్, హరిప్రసాద్, కృష్ణవేణి, కొర్రాయి రవి, రూపవతి, సురేష్, మొదలవలస ఈశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిఇఒ తవిటినాయుడు

పనుల్లో నాణ్యత తప్పనిసరి

డ్వామా పీడీ సుధాకర్



పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

రణస్థలం రూరల్: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించిన పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. మండలంలోని రణస్థలం పంచాయతీలోని పిట్టపాలెం, వేల్పురాయి గ్రామాల్లో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పనులను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెటీరియల్ కాంపోనెంట్ పనులను చేపట్టడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందుతాయన్నారు. ఇందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈయనతో పాటు ఎపిఒ శ్రీనివాసరావు, ఇసి గౌరీశంకర్, పంచాయతీరాజ్ జెఇ అప్పన్న, రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి వెంకట రమణ, వేల్పురాయి సర్పంచ్ బాలి శ్రీను ఉన్నారు.



గాయపడిన వ్యక్తి మృతి

లావేరు: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బోర శంకర్ (36) శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శంకర్ ఈనెల 23న ఇంట్లో విద్యుత్ బోర్డు వద్ద విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడటంతో వెంటే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకర్ ఎనిమిదేళ్లుగా టిబి వ్యాధితో బాధపడుతున్నట్టుగా పోలీసులు తెలిపారు. మృతుని భార్య అసరితల్లి ఫిర్యాదు మేరకు హెచ్‌సి రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఇచ్ఛాపురం : పట్టణంలోని అప్పనపేటకు చెందిన కీర్తి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ చిన్నంనాయుడు శనివారం విలేకరులకు తెలిపారు. కీర్తి, నీలపు హరిప్రసాద్‌కు 2017లో వివాహమైందన్నారు. వీరికి పాప ఉందని తెలిపారు. ఆమె భర్త బతుకుతెరువు నిమిత్తం కలకత్తాలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నారని అన్నారు. హరిప్రసాద్ భార్య పిల్లలను తన అమ్మానాన్నలతో కలిసి అప్పన్నపేటలో ఉంచాడని అన్నారు. ఈ నెల 19న స్కూల్‌కు వెళ్తున్నట్లు ఫోన్‌లో సమాచారం అందజేసి అనంతరం స్విచ్ ఆఫ్ చేసిందన్నారు. దీంతో ఆమె భర్త ఆందోళన చెంది కల్‌కత్తా నుంచి వచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

హోంగార్డుకి గాయాలు



గాయపడిన రేవతి

ఆమదాలవలస : మండలంలోని జొన్నవలస వద్ద హోంగార్డు అన్నెపు రేవతి రోడ్డు ప్రమాదంలో గాయపడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ విధులు ముగించుకుని శనివారం వేకువజామున ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జొన్నవలస వద్ద ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాల పాలైంది. ఈ సంఘటన చూసిన స్థానికులు వెంటనే ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రేవతి భర్త అన్నెపు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తికి జైలు శిక్ష

శ్రీకాకుళం అర్బన్: బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించిన ఓ వ్యక్తికి శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి నెల రోజులు జైలు శిక్ష విధించారు. శుక్రవారం రాత్రి వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో లోపింటి నిరంజన్ భాస్కర్ 80 అడుగుల రోడ్‌లో బహిరంగంగా మద్యం సేవించడంతో పాటు, ప్రజలతో ఇబ్బందికరంగా ప్రవర్తించి న్యూసెన్స్ సృష్టించడంతో సదురు వ్యక్తిని గుర్తించి వన్‌టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ కేసు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి శివ రామకృష్ణ నిరంజన్ భాస్కర్‌కు నెల రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ తెలిపారు. బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

లావేరు: మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలసలో జాతీయ రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయంలో శుక్రవారం రాత్రి ఆలయ గ్రిల్స్ తాళాలు విరగ్గొట్టి దొంగలు హుండీలో ఉన్న నగదును దోచుకెళ్లారని గ్రామపెద్ద దారపురెడ్డి కూర్మారావు తెలిపారు. హుండీలో గత కొంతకాలంగా భక్తులు వేసే కానుకలు, నగదును దొంగలు దోచుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే మండలంలో పలు ఆలయాల్లో దొంగలు నగదు, బంగారం చోరీ జరిగినట్టు పలు ఫిర్యాదులు వెళ్లినా పోలీసుల నుంచి చర్యలు లేకపోవడంతో దొంగలు ఇష్టానుసారంగా ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నరని, ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దొంగతనాలను అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిందితుడిని అరెస్టు చేసిన సిఐ చినంన్నాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టామని, అక్రమంగా గంజాయిని తరలిస్తున్న రహీనా ఆలీ అనే వ్యక్తిని అరెస్టు చేశామని సిఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. సిఐ కార్యాలయంలో శనివారం నిందితుడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడుకి అందిన సమాచారం మేరకు పట్టణంలో రైల్వేస్టేషను వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న రహీనా ఆలీని బ్యాగ్‌ను తనిఖీ చేశారని అన్నారు. అందులో 10,150 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రహీనా ఆలీ కేరళలో త్రిచూరులో భవన నిర్మాణం కార్మికునిగా చేస్తున్నారని అన్నా రు. ఒడిశాకి చెందిన రాహుల్‌తో పరిచయం ఏర్పడి అతని ద్వారా గంజాయి తక్కువ ధరకి కొనుగులు చేసి కేరళలో అధిక ధరకి అమ్మకాలు చేయడానికి రవాణా చేస్తున్నారని చెప్పారు. రహీనా ఆలీని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇద్దరు వ్యక్తులు...

లావేరు: మండలంలోని లింగాలవలసలో బురాడ చిన్నారావుకు చెందిన మామిడితోటలో శనివారం అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. లింగాలవలసకు చెందిన గేదెల రమణ, విజయనగరం జిల్లా పెద్దమాణాపురం మండలం ఇంగులుపల్లి గ్రామానికి చెందిన దాసరి గురునాయుడులు అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్నట్టు పోలీసులకు వచ్చిన సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.14, 320 విలువ గల మందుగుండ సామగ్రిని స్వాధీనం చేసుకోని వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బాలికపై దాడి

పోలీసులకు ఫిర్యాదు

పలాస: మండలంలోని బొడ్డపాడుకు పంచాయతీకి చెందిన కె.ఢిల్లీరావు అనే వ్యక్తి డాన్స్ ఈవెంట్‌కు రాలేదని తమను అడ్డగించి కొట్టారని, తమ సెల్‌ఫోన్లు విరగొట్టారని 9వ తరగతి చదువుతున్న బాలిక, ఆమె తల్లి శనివారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోంపేట మండలం కొర్లంకు చెందిన బాలిక డాన్స్ బాగా చేస్తుండడంతో జెస్సీ ఈవెంట్‌కు చెందిన కె.ఢిల్లీరావు తమను వారి బృందంలో తీసుకున్నారని, చదువులకు ఆటంకం ఏర్పడుతుందని, వాటి నుంచి తప్పుకున్నామని అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం రాజాంలో శుక్రవారం రాత్రి జరిగిన నందెన్న ఉత్సవాల్లో పాల్గొని తిరిగి ద్విచక్రవాహనంపై వేరే వ్యక్తితో వస్తుండగా ఢిల్లీరావుతో పాటు బి.ప్రణయ్, బి.వినయ్, చరణ్ దారి కాచి తమపై దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కాశీబుగ్గ సిఐ బి.మోహనరావును వివరణ కోరగా, బాలిక, తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మాజీ మంత్రి రాజకీయం చేస్తున్నారు

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బొడ్డపాడు పంచాయతీ నుంచి టిడిపికు మెజారిటీ రావడంలో కీలక పాత్ర పోషించి నందుకు తనపై రాజకీయం చేస్తున్నారని కిక్కర ఢిల్లీరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై దాడి చేయలేదన్నారు. ఆడపిల్లలపై అన్యాయం జరిగితే ప్రశ్నించే గొంతుక మొదటిది తనదేనని, ఇదంగా మాజీ మంత్రి అప్పలరాజు, ఆయన అనుచరగణం ఆడుతున్న డ్రామాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో తనను అణగదొక్కడానికి ఇదొక ప్రయోగమని, వాస్తవానికి తాను నిర్వహిస్తున్న ఈవెంట్స్ కార్యక్రమాలు రావద్దని చెప్పానని తెలిపారు. వారిపై చేయిచేసుకున్నాననే ఆరోపణలో నిజం లేదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఢిల్లీరావు

బాణసంచా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాణసంచా

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ పోలీస్ ఠానా పరిధిలోని సీతాపురంలో శుక్రవారం రాత్రి చేసిన తనిఖీలో రూ.50 వేలు విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నామని ఐఐసి సునీల్‌కుమార్ బెహరా తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. అలాగే ఇటీవల మరో ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30 వేలు విలువైన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసినట్లు తెలిపారు.

3న కా.రా మాస్టారు శతజయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కథానిలయం వ్యవస్థాపకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కాళీపట్నం రామారావు శత జయంతి (1924-2024) సందర్భంగా నవంబర్ 3న శ్రీకాకుళ సాహితి, సాహితీ స్రవంతిలు సంయుక్తంగా సెమినార్ నిర్వహిస్తున్నట్టు సాహితి స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో శాసనమండలి పూర్వసభ్యులు ఎం.వి.ఎస్.శర్మ, రచయితలు, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరు నాయుడు, గార రంగనాథం, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్లతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలకు చెందిన పలువురు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొంటారని తెలిపారు. ఈ సెమినార్‌లో కారా మాస్టారి శతాధిక కథలలోంచి ఆణిముత్యాల్లాంటి కథలను ఎంపిక చేసుకొని వర్ధమాన యువ సాహితీవేత్తలు విశ్లేషణా పత్రాల్ని సమర్పిస్తారని తెలిపారు. కారా మాస్టారు కుటుంబ సభ్యులతో పాటు కవులు, రచయితలు హాజరు కానున్నట్టు తెలిపారు.


పోలీస్ అక్షరం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పోలీస్ అమరవీరులకు జోహార్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో స్థానిక జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి జోహార్ ఖాన్ ఆధ్వర్యాన పాఠశాల ఆవరణలో స్టూడెంట్ పోలీస్ కేడట్ వింగ్‌తో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు పోలీస్ ఆంగ్ల భాష అక్షరాల ఆకారంలో కూర్చున్నారు. ఎస్‌పిసి విద్యార్థులు కవాతు నిర్వహించి సెల్యూట్ చేసి పోలీస్ అమర వీరులకు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్‌పండా, మదీనా పాల్గొన్నారు.

రణస్థలం: ప్రజారక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి పేర్కొన్నారు. శనివారం పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పరిసరాలు, స్టేషన్ అధికారి, రైటర్, వైర్ లెస్, కేసుల నమోదు, ట్రాఫిక్ నియంత్రణ, షీ టీమ్ బృందాల సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎందరో పోలీసులు అమరుల య్యారని, వారి త్యాగాలు మరువ లేనివన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో జరుగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో రిమ్స్ ఆధ్వర్యాన ఈ నెల 28న ఉదయం 9 గంటలకు పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు ఎవరైనా రక్తదానం స్వచ్ఛందంగా చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మెగా వైద్య శిబిరంలో పోలీస్ సిబ్బందికి సాధారణ వైద్య పరీక్షలు, కార్డియాలజీ, ఇతర ముఖ్యమైన పరీక్షలు చేయిస్తారని తెలిపారు. అలాగే 29న టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో, 30న కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు కవిటి విద్యార్థి

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న నాగుల తరుణ్ కుమార్ బెహరా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శనివారం తరుణ్ కుమార్‌ను అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు మాట్లాడుతూ తరుణ్‌కుమార్ రాష్ట్రస్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తెప్పల మోహనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ప్రకాష్‌రావు, ఎం.దీనారావు, ఉపాధ్యాయులు జానకిరావు, వాసుదేవరావు, కష్ణ శర్మ, నాయుడు, గిరిబాబు, కృష్ణారావు, లచ్చయ్య, రాధిక, అరుణ కుమారి, జ్యోతి కుమారి, పద్మిని పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పురుగుమందుల షాపు తనిఖీ

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట, కొర్లం గ్రామాల్లోని పురుగుల మందు విక్రయాల షాపులను వ్యవసాయ శాఖ ఎడిఎ మధు, మండల ఎఒ నరసింహమూర్తి శనివారం తనిఖీలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగుల మందు తయారీదారు, సరఫరాదారు సంస్థలు, విక్రయదారు వద్ద ఉండాల్సిన పత్రాల లభ్యతపై ఉన్న లోపాలను నివారించేందుకు తనిఖీలు చేపట్టమన్నారు. అలాగే స్టాకు వివరాలు, నిలువ వుస్తున్న ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. షాపుల్లో రికార్డులను తనిఖీ చేశారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు.

అవినీతిని అంతం చేద్దాం

నరసన్నపేట : అవినీతిని అంతం చేయడానికి ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు సూచించారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర, మూలపేట వివేకానంద యువజనసేవ సంఘం ఆధ్వర్యాన శనివారం విజిలెన్స్ డేపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హెడ్ కానిస్టేబుల్ వై.దాలినాయుడు పాల్గొని మాట్లాడారు. అవినీతిని అరికట్టె విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతి అవినీతిపరుడూ జవాబుదారిగా మార్చడం సమాజం వీధి అని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ జి.వి.జగన్నాథరావు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎం.మోహనరావు, జి.వెంటరమణ మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం అధ్యక్షుడు గుజ్జల ఉమామహేశ్వరరావు, శాంతిస్వరూప్, యువజన సేవా సంఘం కార్యదర్శి కళింగపట్నం రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర పారిశ్రామిక శిక్షణా సంస్థలో కాన్వొకేషన్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది ఉత్తీర్ణులైన వివిధ ట్రేడ్‌లకు చెందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పురపాలక సంఘం మాజీ వైస్ చైర్‌పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి చేతులమీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి మెమొంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు వెళ్లినప్పుడే విద్యార్థితో పాటు కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు వస్తాయన్నారు. ఐటిఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్ రంగాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలను సాధించవచ్చునన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగాన్ని సాధించి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాల న్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఐటిఐ కరస్పాండెంట్ కూన భానోజీరావు, ప్రిన్సిపాల్ వరప్రసాదరావు, ఉపాధ్యాయులు నాగభూషణం, కృష్ణంరాజు, సంతోష్ కుమార్, శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న వెంకట రాజ్యలక్ష్మి

ఆదివాసీలపై దాడి హేయం

ప్రజాశక్తి- నందిగాం

జలుమూరు మండలం సవరమాకివలసకు చెందిన ఆదివాసీ మహిళలపై ఈ నెల 19న రాత్రి కూర్మ గ్రామంలోని ఆశ్రమానికి చెందిన అగ్రకుల దౌర్జన్యకారులు సామూహిక దాడులు చేసి మహిళను విచక్షణారహితంగా వివస్త్ర చేయడం హేయమైన చర్య అని ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బి.నారాయణరావు అన్నారు. నందిగాంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ దౌర్జన్య కారులపై హత్య, హత్యాచార నేరాల కింద అరెస్టులు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే కూర్మలో అక్రమంగా 18 ఎకరాలు భూమిని కేటాయించారని, ఆ కేటాయింపునూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని శారదా పీఠానికి అక్రమంగా కేటాయించిన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల క్యాబినెట్‌లో రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని అన్నారు. ఆదివాసీలకు భూములు సర్వ హక్కులతో పించే జీవనోపాధి కల్పించాలని కోరారు. భవిష్యత్‌లో ఆదివాసీలకు దాడుల నుంచి కాపాడాలని, తెలంగాణ ప్రాంతం నుంచి వలస వచ్చిన వలసదారులను ఇక్కడ నుంచి తరిమి వేయాలని పిలుపునిచ్చారు. ఈయనతో పాటు ఎ.లోకనాథం, సిహెచ్.శ్రీనివాసరావు, గణపతిరావు ఉన్నారు.


మాట్లాడుతున్న నారాయణరావు


మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

ఓటర్ల నమోదు వేగవంతం

ప్రజాశక్తి- నరసన్నపేట

ఉపాధ్యాయులు ఎమ్మెల్సీకి ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి సూచించారు. స్థానిక హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కేవైకుంఠరావు, ఆర్.దమయంతి, టి.సుధీర్‌కుమార్, కె.ఆదినారాయణ, ఎస్.రాజేష్, పి.ఉమా భాస్కర్, పురుషోత్తం, దంత లక్ష్మణరావు, మన్మథరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- లావేరు

దీపావళి సందర్భంగా మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణా సంచా అమ్మకాలు అక్రమంగా జరిపితే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ గదుల లక్ష్మణరావు అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్లలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది బాణాసంచా అమ్మకాలు చేసిన చోట ఖచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకొని నియమ నిబంధనలకు లోబడి విక్రయాలు జరపాలన్నారు. స్టేషన్ పరిధిలో తొమ్మిది గ్రామాలకు చెందిన 16 మందిపై రౌడీ షీట్లు ఇప్పటికే నమోదై ఉన్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు.



మాట్లాడుతున్న రమణ

శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పలాస

నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి ఉపాధి కల్పించడం జరుగుతుందని మెప్మా పీడీ ఎస్.వి.రమణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాలు, మెప్మా సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేయడానికి అవగాహన కల్పించాలన్నారు. వార్డుల్లో నిరుద్యోగ యువతపై సర్వే నిర్వహించి వారికి తగిన విధంగా నైపుణ్యశిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి సభ్యుల డేటా ఆన్‌లైన్ పొందుపరుస్తామన్నారు. కార్యక్రమంలో డిపిఎంఒ ఐ.బి.రాము, సి.ఎం.ఎం.మోహన్ పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రుమలరావు

'ఉపాధి' పనుల పరిశీలన

కంచిలి: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కూలి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ వి.తిరుమలరావు తెలిపారు. మండలంలోని పెద్దశ్రీరాంపురం పరిధిలో జరుగుతున్న సరిహద్దు కందకాల నిర్మాణ పనులను శనివారం ఎపిఒ ధనుంజయ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలందరికీ పూర్తిస్థాయిలో పనులు కల్పిస్తామన్నారు. కొత్త పనులను గుర్తించడం, అయిన పనులకు వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రోడ్డు పనుల తనిఖీ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండలంలో జరుగుతున్న మెటీరియల్ కాంపోనెంట్ పనులను క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రూరల్ మండలం కిష్టప్పపేట, సింగపురంలో నిర్మిస్తున్న సిమ్మెంట్ రహదారులతో పాటు గోకులం షెడ్ పనులను అధికారులు కె.గోవిందరావు, మన్మథరావులు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని, నాణ్యత లోపిస్తే రికవరీలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రత్నాకర్, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల అందజేత

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ ఐటిఐలో రెండేళ్లు, ఏడాది కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లును అందజేశారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, ఇన్‌స్ట్రుమేంటేషన్, మెకానికల్, సివిల్ డ్రాఫ్టుమెన్, వెల్డరు, కోపా, స్వీవింగ్ టెక్నాలజీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎం.గోపాలరెడ్డి సర్టిఫికెట్లును అందజేశారు.

బాబు, పవన్‌ల లబ్ధి కోసమే షర్మిల ఆస్తుల డ్రామా

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని జైలుకు పంపించి, టిడిపి, జనసేన, బిజెపి రాష్ట్రంలో ఎదురులేకుండా చేయడానికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకే పిసిసి అధ్యక్షులు షర్మిల అస్తి డ్రామ అడుతున్నారని టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని జర్జంగిలో వైసిపి నాయకుడు అన్నెపు రామారావు స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తులతో షర్మిళ స్నేహం చేసి సొంత అన్నకే జైలుకు పంపించాలని చూస్తుందని అన్నారు. ఇడి కేసులో అటాచ్‌మెంట్ ఉన్న ఆస్తులను వాట కింద రాయమనడం సరికాదన్నారు. ఇప్పుడు ఆ ఆస్తిని రాసిస్తే బైల్ రద్దయే పరిస్థితి ఉందని అన్నారు. పదేళ్ల గుర్తుకు రాని అస్తి ఇప్పుడు అడగటం చూస్తే ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిలక్

నవోదయ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


ప్రోత్సాహకాలను అందజేస్తున్న సోమేశ్వరరావు

ప్రజాశక్తి- కంచిలి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఎంఇఒలు ఎస్.శివరాం ప్రసాద్, చిట్టి బాబులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతేడాది పాఠశాల నుంచి నవోదయకు ఎంపికైన ఎన్.రామ్ నర్వార్, కె.మహేష్ రెడ్డి, ఐ.కౌశికులకు పూర్వ హెచ్ఎం ఎస్.సోమేశ్వరరావు రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అలాగే కొత్తపుట్టుగకు చెందిన ఎన్.రాము ఈ ఏడాది నవోదయ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు రూ.5 వేలు విలువ చేసే మెటీరియల్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.కామరాజు, ఉపాధ్యాయులు నల్లాన రవి, ఎం.కృష్ణమూర్తి, జె.భగవతిరావు, ఢిల్లీరావు, శంశంకరరావు, బసంతి, నాగరత్నం, సంతోషం, లండ లోకనాథం, జగదీష్ పట్నాయక్, బంగారు కూరయ్య, సీతారాంనాయుడు, రమ, భీష్మ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- మందస

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ అన్నారు. మండలంలోని బహాడపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలోకదంబ ,బాదం, చెర్రీ, ఉసిరికా కాము, తురాయి వివిధ రకాల నీడనిచ్చే మొక్కలను శనివారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాన్లు, ప్రకృతి విలయాలు దారి తీయడానికి పర్యావరణ సమతుల్యత లోపించడమే కారణమని అన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ పర్యావరణపై విద్యార్థులకు ఇప్పటినుంచే అవగాహన కల్పిస్తే రాబోయే తరాలకు మంచి ఫలితాలు ఇస్తాయని తెలియజేశారు. అలాగే ప్రతి విద్యార్థీ జన్మదిన సందర్భంగా మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దీనబంధు, వసంతరావు, ప్రకాశరావు, శంకరరావు, విజయలక్ష్మి రెహనా, దీప్తి, సాంబమూర్తి, కృష్ణారావు, వెంకటరమణ, ఢిల్లీరావు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న గోపాల్

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎమ్మెల్యే గోవిందరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి రాముని అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ విషయంలోనైనా విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కలిగితే తనకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చక్రపతి, హనుమంతరావు నాయక్, టి.రమేష్, డి.బాబూరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దలక్ష్మీపురం, బందపల్లి, నేలబొంతు, భరణికోట, పెద్దమడి, చాపర గిరిజన ఆశ్రమ పాఠశాలను టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. పాఠశాలలోని మౌలిక సౌకర్యాలు, విద్యాభివృద్ధి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకొని పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. చదువుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చే వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు


అరసవల్లిని దర్శించుకుంటున్న నైర విద్యార్థులు

అరసవల్లి సన్నిధిలో విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైరా వ్యవసాయ కళాశాల యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులు సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా శనివారం విద్యార్థులు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. డిప్యూటీ కమిషనర్ భద్రాజీ విద్యార్థులకు అరసవల్లి విశిష్టతను వివరించారు. జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు హాజరై మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ సందర్శన స్థలాల విశిష్టతను వివరించారు.

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శనివారం విజయవాడలోని పెద్ద పులిపాక పీఠాధిపతి వాసు దేవానందగిరి సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల అనంతరం వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ చిత్రపటాన్ని అందజేశారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 305వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం దీక్షలో పాల్గొన్న రాజపురం గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లోకు బిసాయి, రమేష్ బిసాయి, భాస్కర్ బిసాయి, క్రిష్ణ బిసాయి, మాధవ్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న రాజపురం గ్రామస్తులు

పివిసి ధ్రువపత్రాలకు అవస్థలు

బూర్జ : పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం తాము ఇబ్బందులకు గురవుతున్నామని అభ్యర్థులు శనివారం తెలిపారు. గత రెండు రోజులుగా వివిధ సెలక్షన్ కోసం అవసరమైన పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని అభ్యర్థులు వాపోతున్నారు. అయితే సర్టిఫికెట్ మంజూరు చేయాలంటే స్టేషన్‌కు స్టేషనరీ ఇవ్వాలని అడుగుతున్నారని అభ్యర్థులు తెలిపారు. ఇవ్వకపోతే సర్టిఫికెట్ మంజూరు కాదని కరాఖండీగా చెప్తున్నారని వారు వాపోతున్నారు. ఇదే విషయాన్ని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. సత్యనారాయణను వివరణ కోరగా అభ్యర్థులు ఎవరు స్టేషన్‌కు ఏమి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సకాలంలో అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్ జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్‌బిఐ ఉద్యోగుల సంఘం రీజనల్ సెక్రటరీగా సత్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్: స్టేట్‌బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న కరణం చిన్నసత్యనారాయణ వరుసగా నాలుగోసారి ఎస్‌బిఐ ఉద్యోగుల సంఘ రీజనల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 20, 21 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఇంతవరకు మూడుసార్లు రీజనల్ సెక్రటరీగా పనిచేస్తున్న కరణం చిన సత్యనారాయణ పనితీరు, నిబద్ధత గుర్తించి నాలుగోసారి అవకాశం కల్పించిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులకు ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అరసవల్లి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో పనిచేస్తున్న సత్యనారాయణకు పదవి రావటంపై బ్యాంక్ ఉద్యోగులు అభినందించారు.


రాపాకలో చిన్నారుల కోలాటం

గౌరీదేవి, నందీశ్వరుల నిమజ్జనం

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకలో గౌరీదేవి, నందీశ్వర్ల నిమజ్జన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

పేదరిక నిర్మూలనకు కృషి

కంచిలి: పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేస్తూ మహిళల ఆర్థిక అభివద్ధికి కృషి చేస్తున్నామని ఎపిఎం ఎస్.ప్రసాదరావు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన చేపడుతున్న అభివృద్ధి పథకాలు, సబ్సిడీ రుణాలు ఇతర అంశాలను గురించి ఎమ్మెల్యేతో చర్చించమన్నారు. పథకాల నిర్వహణను వేగవంతం చేస్తూ లోపాలను సరిదిద్దుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వెలుగు సంస్థ ద్వారా చేయూత అందిస్తామన్నారు.


పరామర్శిస్తున్న అప్పలరాజు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మందస : గత కొన్ని రోజులుగా మందస మండలంలో వైసిపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులు జరుగుతున్నాయని, కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భరోసా ఇచ్చారు. ఇటీవల గాయపడిన లబ్బ ఢిల్లేశ్వరిని నందిగాం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. విషయం తెలుసుకున్న అప్పలరాజు ఆమెను పరామర్శించి ఓదార్చారు. ఈయన వెంట ఎంపిపి దానయ్య బత్తిని లక్ష్మణ్, పిఎసిఎస్ అధ్యక్షులు సొర్ర ఢిల్లీ ఉన్నారు.

డొంకూరు విద్యార్థి ప్రతిభ

ఇచ్ఛాపురం: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చెస్ పోటీలకు డొంకూరు విద్యార్థి పి.నితిన్ ఎంపికయ్యారు. ఎచ్చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో నితిన్ ప్రథమ స్థానం పొందారు. ఈ నెల 28 నుంచి 29 వరకు బాపట్ల జిల్లా ఇదిపల్లిలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారని కోచ్ తాజ్ తెలిపారు. నితిన్‌కు ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్.వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించారు.


అభినందిస్తున్న ఉపాధ్యాయులు